విడవని వాన

చెన్నైలో ఏకబిగిన 32 గంటల పాటు జల్లులు

ఎన్నూరులో 13 సెం.మీ.ల వర్షపాతం నమోదు


మెరీనాతీరంలో ఎగసిపడుతున్న రాక్షస అలలు


మెరీనాబీచ్ వద్ద దూసుకు వస్తున్న అలలు


మొగప్పేర్ - అంబత్తూరు మెయిన్‌రోడ్డులో వర్షం కారణంగా ఆగిన వాహనాలు

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాల ప్రభావం, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప వాయుపీడనాలు, ప్రస్తుతం ముంథా తుఫాన్ కారణంగా నగరంలో పక్షం రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం 6 నుండి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు (32 గంటలపాటు) నగరం, శివారు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. ఈ వర్షాలకు తోడు నగరంలో విపరీతమైన చలిగాలులు కూడా వీస్తుండటంతో నగరవాసులు వణకిపోతున్నారు. 'ముంథా' తుఫాన్ కాకినాడ దిశగా వెళుతున్నప్పటికీ ఆ తుఫాను కారణంగా సముద్రతీర ప్రాంతాల్లో గంటలకు 50 కి.మీ.ల వేగంతో పెనుగాలుల కారణంగా వర్షం కురుస్తున్నట్లు వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. తుఫాను తీరం దాటే సమయంలో నగరంలోను, తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లో భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. నగరంలోని తట్టాన్‌కు శం, కేఎం గార్డెన్, మాధవరం, పెరియార్ నగర్ తదితర ప్రాంతాల్లో వరదలా ప్రవహిస్తున్న వాననీటిని కార్పొరేషన్ అధికారులు మోటారు పంపుల ద్వారా తొలగించారు. అదే సమయంలో విద్యుత్ సరఫరాకు కూడా ఎలాంటి అంతరాయాలు సంభవించలేదన్నారు. ఎన్నూరులో 13 సెం.మీలు. కత్తివాక్కం వద్ద 10 సెం.మీ.లు, విమ్కోనగర్‌లో 9 సెం.మీ.లు, మాధవరం, మణలి పుదునగర్, మేడవాక్కం ప్రాంతంలో 8 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది. పొన్నేరి, అంబత్తూరు, బేసిన్‌బ్రిడ్జ్, ఆవడి, పెరంబూరు, తండయార్‌పేట ప్రాంతాల్లో 7 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది.

రిజర్వాయర్లలో పెరిగిన నీటిమట్టం...

'మొంథా' ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నగరానికి మంచినీరందించే ప్రధాన జలాశయాల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోందియి. పుళల్ జలాశయానికి ఇన్‌ఫ్లో సెకనుకు 265 ఘనపుటడుగుల నుండి 556 ఘనపుటడుగులకు పెరిగింది. ఆ జలాశయం సామర్థ్యం 21 అడుగుల కాగా, ప్రస్తుత నీటిమట్టం 18.49 అడుగులకు చేరింది. పూండి రిజర్వాయర్‌లోను వ మంగళవారం ఉదయం ఇన్‌ఫ్లో సెకనుకు 4650 ఘనపుటడుగుల మేర నమోదైంది. ఆ రిజర్వాయర్ నుండి సెకనకు 7 వేల ఘనపుటడుగుల చొప్పున నీరు విడుదల చేస్తున్నారు. చెంబరంబాక్కం జలాశయంలో మంగళవారం ఉదయం ఇన్‌ఫ్లో సెకనుకు 1221 ఘనపుటడుగులకు పెరిగింది. ఆ జలాశయం సామర్థ్యం 24 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 21.28 అడుగులకు చేరింది.

జలదిగ్బంధంలో 4వేల ఇళ్లు...

నగర శివారు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో సుమారు 4వేలకు పైగా ఇళ్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆవడి కార్పొరేషన్ పరిధిలో కోవిల్‌పతాగై, 20, 37 వార్డులు, పట్టాభిరామ్ గోపాలపురం, తెండ్రల్ నగర్ ప్రాంతాల్లో సుమారు 2 వేల ఇళ్ల చుట్టూ వర్షపు నీరు ప్రవహిస్తోంది.

తిరువళ్లూరు జిల్లాలో...

తిరువళ్లూరు జిల్లాలోనూ భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఆ జిల్లాలోని పాఠశాలలకు మంగళవారం సెలవు ప్రకటించారు. తిరుత్తణిలో మంగళవారం ఉదయం భారీగా వర్షం కురిసి జనావాస ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జిల్లాల్లో గరిష్ఠంగా పొన్నేరిలో 7 సెం.మీలు, ఆవడిలో 6.7 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైంది. ఊత్తుకోటలో 61మి.మీ.లు, రెడ్‌హిల్స్‌లో 52 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాల్లోనూ గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురిశాయి.

స్తంభించిన ట్రాఫిక్...

సోమవారం రాత్రి పలు ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అన్నాసాలై, గిండి, పూందమల్లి, క్రోంపేట జీఎస్టీ రోడ్డు, ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు, తిరువాన్మియూరు, అడయార్, పట్టినంబాక్కం, మెరీనాబీచ్ ప్రాంతం తదితర ప్రాంతాల్లో సోమవారం రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకూ వాహన చోదకులు అవస్థలుపడ్డారు. ఇదే విధంగా పూందమల్లి హైరోడ్డు, మందవెల్లి, మైలాపూరు ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.



కోయంబత్తూరులో సిటిజన్ ఫోరం సత్కారసభలో ప్రసంగిస్తున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

నా ప్రజా జీవితానికి కోవై నుంచే శ్రీకారం

● ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులోనే తన ప్రజా జీవితం ప్రారంభమైందని, ఈ విషయాన్ని చెప్పుకోవడానికి తానెంతో గర్వపడుతున్నానని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించి తొలి అధికారిక పర్యటనగా సీషెల్స్ వెళ్ళిన సీపీ రాధాకృష్ణన్ ఆ దేశ అధ్యక్షుడు డాక్టర్ పాట్రిక్ హెర్మినీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న తర్వాత మంగళవారం ఉదయం కోవై చేరుకున్నారు. ఉప రాష్ట్రపతి అయిన తర్వాత తొలిసారి కోయంబత్తూరు వచ్చిన సందర్భంగా విమానాశ్రయంలో బీజేపీ ప్రముఖులు, పోలీసు ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత కోటిషియా మైదానంలో జిల్లాలోని పారిశ్రామికవేత్తలంతా 'కోయంబత్తూరు సిటిజెన్స్ ఫోరమ్' పేరిట ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను ఘనంగా సత్కరించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందితేనే ప్రజలంతా అభివృద్ధి చెందగలరని, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. తనపై నమ్మకంతో ప్రధాని మోదీ మొట్టమొదటిసారిగా కోయర్ బోర్డ్ చైర్మన్‌గా నియమించారని, తన సేవలను గుర్తించి తన పదవీ కాలాన్ని మరో యేడాదిపాటు పెంచారని,, ఆ తరువాత గవర్నర్‌గా నియమించారని చెప్పారు. ఒకే సమయంలో మూడు రాష్ట్రాల గవర్నర్‌గా పని చేశానని, చివరగా మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్నప్పుడు ఉపరాష్ట్రపతిగా ఎంపిక చేశారని తెలిపారు. ప్రయత్నాలు మంచివైతే, వాటిని దేవుడే సఫలం చేస్తాడని తెలిపారు. కోయంబత్తూరు విమానాశ్రయాభివృద్ధికి తనవంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 'కోటీషియా' చైర్మన్ కార్తికేయన్, శక్తి గ్రూప్ చైర్మన్ మాణిక్కం, కేజీ గ్రూపు చైర్మన్ బాలకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ నిర్వాహకుల శిక్షణా శిబిరంలో ప్రసంగిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్

శాశ్వతంగా పాలించే సత్తా మాకే ఉంది

● డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ధీమా

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి డీఎంకే ఏడోసారి అధికారంలోకి రానున్నదని, రాష్ట్రాన్ని శాశ్వతంగా పాలించే సత్తా తమ పార్టీకి మాత్రమే ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ధీమా వ్యక్తం చేశారు. మహాబలిపురం సమీపంలోని రిసార్ట్‌లో మంగళవారం ఉదయం జరిగిన పార్టీ నిర్వాహకుల శిక్షణా శిబిరం ప్రారంభ సభలో ఆయన ప్రసంగిస్తూ.. ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్న డీఎంకే కార్యకర్తలు, స్థానిక నాయకులకోసం ఏర్పాటైన ఈ శిబిరం పరీక్షల కోసం బాగా చదివిన విద్యార్థి పరీక్షలు సమీపిస్తున్న వేళ చదివిన పాఠాలన్నింటినీ రివ్యూ చేయడం వంటిదని చమత్కరించారు. ఎన్నికలకు సిద్ధమైన పార్టీ శ్రేణుల నిర్వర్తించాల్సిన బాధ్యతను మరోమారు గుర్తు చేయడానికే ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. 2019 నుండి 2021 వరకు జరిగిన లోక్‌సభ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు, శాసనసభ ఎన్నికల్లో వరుసగా విజయం సాధించామని, వచ్చే యేడాది జరుగనున్న శాసనసభ ఎన్నికల్లోనూ ఆ విజయపరంపర కొనసాగి తీరుతుందన్నారు. ఆ ఎన్నికల ఫలితాలు వెలువడే రోజున ప్రసారమాధ్యమాలన్నీ రాష్ట్రంలో 'ద్రావిడ తరహా 2.0 పాలన' ప్రారంభమైనట్లు పతాక శీర్షికలతో వార్తలను రావడం ఖాయమన్నారు. గత నాలుగేళ్లుగా డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సత్ఫలితాలనివ్వడం, తమ పాలనపై ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలను నిశితంగా పరిశీలించిన మీదటే మళ్ళీ అధికారంలోకి వస్తామని ధైర్యంగా ప్రకటిస్తున్నానని స్టాలిన్ అన్నారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అమలు చేసినంతగా దేశంలోని ఏ రాష్ట్రంలోనూ ఇంతటి పథకాలను అమలు చేయలేదని, ఆ పథకాలు సత్ఫలితాలివ్వడం వల్లే ఇటీవల పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్ళి సభ్యత్వ కార్యక్రమం చేపట్టినపుడు ప్రజలు బాగా ఆదరించారని తెలిపారు.

బీజేపీ ద్రోహాలపై ప్రచారం చేయండి...

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పాలకులు గత నాలుగేళ్లుగా పథకాలకు నిధులు విడుదల చేయకుండా, కనీసం విద్యా సంబంధిత పథకాలకు కూడా చిల్లిగవ్వ ఇవ్వకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని, రాష్ట్రానికి ఆ దుష్టశక్తులు చేస్తున్న ద్రోహంపై ప్రజల్లో అవగాహన కలిగేలా ప్రచారం చేయాలని పార్టీ నిర్వాహకులకు స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఐదేళ్ల పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని కబళించేందుకు అన్నాడీఎంకే, బీజేపీ నేతలు చేస్తున్న కుట్రను వమ్ము చేయడమే డీఎంకే కూటమి ప్రధాన లక్ష్యమన్నారు. ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సక్రమంగా తన బాధ్యత కూడా నెరవేర్చకుండా అన్నాడీఎంకే పార్టీని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వద్ద తాకట్టు పెట్టేసి, రాష్ట్రానికే తలవంపులు తెచ్చిపెట్టారని స్టాలిన్ విమర్శించారు. డీఎంకే కూటమిలోని మిత్రపక్షాలన్నీ తమ కూటమిలో చేరతాయంటూ ఈపీఎస్ రోజుకో పాట పాడుతూ వచ్చారని, డీఎంకే మిత్రపక్షాలేవీ స్పందించకపోవటంతో చివరకు విరక్తి చెందిన తనపై లేనిపోని విమర్శలు చేస్తున్నారని తెలిపారు.

కరూర్ దుర్ఘటనకు విజయ్ కారణం

● ఎన్టీకే అధినేత సీమాన్ ఆరోపణ



పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కరూర్ రోడ్‌షోలో తొక్కిసలాట జరిగి 41మంది ప్రాణాలు కోల్పోవటానికి, వందమందికిపైగా గాయపడటానికి 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) నేత విజయే కారణమని 'నామ్ తమిళర్ కట్చి' (ఎన్టీకే) సమన్వయకర్త సీమాన్ ఆరోపించారు. మంగళవారం ఉదయం తిరునల్వేలిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వాస్తవానికి సెప్టెంబర్ 27న విజయ్ సేలం జిల్లాలో రోడ్‌షోలో జరపాల్సి ఉండగా ఆఖరిక్షణంలో తన పర్యటన మార్చుకుని కరూర్‌కు ఎందుకు వెళ్ళారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రోడ్‌షోకు నిర్దేశిత సమయంలో వెళ్ళకుండా ఏడు గంటలకు పైగా ఆలస్యంగా విజయ్ వెళ్లటం వల్లే ఆయన్ని దగ్గరగా చూడాలన్న తపనతో పెద్ద సంఖ్యలో గుమికూడారన్నారు. కరూర్ దుర్ఘటనపై సీబీఐ విచారణ సక్రమంగా జరుగుతుందనే నమ్మకం తనకు లేదని, సీబీఐ విచారణ జరుగుతుందని ప్రకటన రాగానే ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు బెయిలు కోసం ప్రయత్నించిన టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ కోర్టులో దాఖలు చేసిన బెయిలు పిటిషన్ వెనక్కితీసుకోవటం వెనుక దాగి ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ పాలకులు తమ కూటమిలో చేరాలని టీవీకేకు పిలుపునివ్వటం వల్లే సీబీఐ విజయ్‌పై కేసు నమోదు చేయడానికి తటపటాయిస్తోందని సీమాన్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఎన్డీయేలో చేరకపోతే విజయ్‌పై, బుస్సీ ఆనంద్, ఆదవ్ అర్జునాపై కేసులు నమోదు చేయటం ఖాయమని ఆయన చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు గడువు కంటే ముందుగానే జరుగుతాయన్న ఊహాగానాలపై ఆయన వ్యాఖ్యానిస్తూ ముందస్తు ఎన్నికలు జరిగినా, నిర్దేశిత సమయంలో ఎన్నికలు జరిగినా ఫలితాల్లో ఎలాంటి మార్పులు సంభవించవని చెప్పారు.


చెన్నై వలసరవాక్కంలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే తాయగం కవి మాతృమూర్తి సౌందరి అమ్మాళ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రి కేఎన్ నెహ్రూ, ఎంపీ టీఆర్ బాలు

డీఎంకేను ఇంటికి సాగనంపడం ఖాయం

● టీవీకే నేత విజయ్



చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటల్లో కంకులు మొలకెత్తినట్లే, రాష్ట్ర ప్రజల్లో డీఎంకే పాలనపై తీవ్ర వ్యతిరేకత మొలకెత్తి, పెరిగి పెద్దదై పాలకులను ఇంటికి సాగనంపటం ఖాయమైపోయిందని 'తమిళగ వెట్రి కళగం' నాయకుడు విజయ్ జోస్యం చెప్పారు. కరూర్ దుర్ఘటన జరిగిన నెల రోజుల తర్వాత విజయ్ వర్షాలకు పంటలను నష్టపోతున్న రైతులను ఆదుకోవటంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెప్టెంబరు 27 రాత్రి కరూర్‌లో రోడ్‌షో సందర్భంగా తొక్కిసలాట జరిగి 41 మంది మృతి చెందటంతో విజయ్ చెన్నైలోని తన ఇంటికే పరిమితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తడిసిన దాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకుండా డీఎంకే ప్రభుత్వం రైతులను తీవ్ర నష్టాలకు గురిచేసిందని ఆరోపించారు. డీఎంకే ప్రభుత్వం రైతులపట్ల నిజంగా శ్రద్ధ వహించేది అయితే, రైతుల జీవనోపాధి కాపాడి, ఆర్థికంగా ఎదగటానికి అవసరమైన చర్యలు చేపట్టి ఉండేదని, అయితే దాన్యం సకాలంలో కొనుగోలు చేయకుండా, వర్షం నీటిలో తడిసి వృథా అయ్యేలా చేసి ప్రభుత్వం రైతుల కడుపుకొట్టిందని విజయ్ విమర్శించారు. తాను డెల్టా రైతు కుటుంబానికి చెందినవాడినంటూ గొప్పలు చెప్పుకుంటున్న స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. డెల్టా రైతుల శ్రమించి పండించిన వరి ధాన్యాలను సకాలంలో గిట్టుబాటు ధర ప్రకటించి కొనుగోలు చేయకపోవడానికి కారణమేమిటి? రుతుపవన వర్షాల వల్ల పంటలు నష్టపోకుండా డీఎంకే ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఏమిటని ప్రశ్నించారు. కొద్ది రోజులుగా కురిసిన వర్షం కారణంగా తడిసి వరి వృథా కావటానికి, వాటిని పండించిన రైతుల ఆవేదనకు స్టాలిన్ ప్రభుత్వం సమాధానాలు చెప్పగలదా అని విజయ్ ప్రశ్నించారు.

టీవీకేకు కొత్త నిర్వాహక కమిటీ

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) కొత్త నిర్వాహక కమిటీని ఏర్పాటుచేస్తున్న పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు. 28 మందితో కూడిన ఈ కమిటీ పనిచేస్తుందని విజయ్ తెలిపారు. ఈ విషయమై విజయ్ విడుదల చేసిన ప్రకటనలో.. పార్టీ ప్రధాన కార్యదర్శి ఆనంద్, ఆధవ్ అర్జునా, అరుణ్‌రాజ్ తదితరులున్నారు. ఈ కమిటీకి నేతలు, కార్యకర్తలు సహకరించాలని విజయ్ విజ్ఞప్తి చేశారు. కాగా, కొత్త నిర్వాహక కమిటీ తొలి సమావేశం బుధవారం పనయూర్‌లోని పార్టీ కార్యాలయంలో జరుగుతుందని విజయ్ ప్రకటనలో తెలిపారు.

జాగ్రత్తగా పరిశీలించండి

● తప్పులకు అవకాశం ఇవ్వొద్దు
● వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్లకు సీఈసీ దిశానిర్దేశం



చెన్నై,అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా పరిశీలించి ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 'ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)'పై జిల్లా కలెక్టర్లతో ప్రధాన ఎన్నికల కమిషనర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశంలో ఓటర్ల జాబిత సవరణ కార్యక్రమాన్ని 8 సార్లు నిర్వహించారు.చివరి సవరణ కార్యక్రమం 2002-2004 లో చేపట్టారు. 21 ఏళ్ల అనంతరం బిహార్ ఎన్నికల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టారు. ఆ జాబితో 65 లక్షల మంది ఓటర్ల పేర్లు గల్లంతు కావడం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో విచారణలో ఉంది. తాజాగా, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్,పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా సవరణ చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే.రాష్ట్రంలో ప్రస్తుతం 6.41 కోట్ల మంది ఓటర్లుండగా, 68,467 పోలింగ్ కేంద్రాలున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం చేసిన ప్రకటనతో ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాను స్తంభింపజేశారు. తాజాగా ఎస్ఐఆర్ ప్రారంభించేందుకు ఈసీ సమాయత్తమవుతోంది. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయమై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్ఐఆర్ నిర్వహించాల్సిన విధివిధానాలను స్పష్టం చేశారు. సవరణలో ఆధార్ కార్డు ఒక గుర్తింపు కార్డుగా మాత్రమే పరిగణించాలని, పౌరసత్వ, జనన ధ్రువీకరణ పత్రాలను పుట్టిన రోజు తేదీ నిర్ధారణకు వినియోగించరాదని సూచించారు. నవంబరు 4 నుంచి అధికారులు ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని, అందుకు సంబంధించిన శిక్షణను ఇవ్వాలని సీఈసీ దిశానిర్దేశం చేశారు. కాగా, రాష్ట్రంలో ఎన్నికల పనులు నిర్వహించే అధికారులకు ఇప్పటికే తొలివిడత శిక్షణ ఇవ్వగా, బుధవారం నుంచి వచ్చే నెల 3వ తేది వరకు ఆయా జిల్లా కలెక్టర్లు శిక్షణ ఇవ్వనున్నారు.

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తిరుముడివాక్కంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి. తిరుముడివాక్కం పరిధిలోని ఎరుమయూర్, క్రషర్ ఏరియా, కిష్కింధ మెయిన్ రోడ్డు, రాజీవ్ నగర్, ఇందిరా నగర్, గురు నగర్, వివేకానంద నగర్, పలన్‌తండాలం, నాగన్ వీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

అయనావరంలో 203 ఇళ్ల విక్రయం

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయనావరంలో 13 అంతస్తులతో కూడిన అపార్ట్‌మెంట్‌ను హౌసింగ్ బోర్డు నిర్మించింది. అందులో 933 నుంచి 1,003 చ.అ వరకు విస్తీర్ణం కలిగిన 203 ఇళ్లు ఉన్నాయి. మధ్యతరగతి ప్రజలకు ఈ ఇళ్లు విక్రయించాలని హౌసింగ్ బోర్డు నిర్ణయించింది. ఈ ఇళ్ల ధర రూ.89 లక్షల నుంచి రూ.97 లక్షలుగా నిర్ణయించారు. ఒక నెల ఆదాయం రూ.70వేలు ఉన్న వారికి ఈ ఇళ్లు కేటాయించాలని నిర్ణయించారు. ఇళ్లు కొనుగోలుకు ఆసక్తి ఉన్న వారు నవంబరు 22వ తేదిలోగా https://tnhb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని హౌసింగ్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

31న ప్రైవేట్ జాబ్ మేళా

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి ఆలందూర్ రోడ్డులో ఉన్న ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో, ఈ నెల 31వ తేది ప్రైవేటు జాబ్ మేళా జరుగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో, 8వ తరగతి నుంచి డిగ్రీ, వృత్తి విద్య, శిక్షణ కోర్సులు పూర్తిచేసిన వారు పాల్గొనవచ్చు. శిబిరంలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు, www.tnprivatejobs.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని చెన్నై జిల్లా కలెక్టరేట్ ఒక ప్రకటనలో తెలియజేసింది.

హొగెనేకల్‌లో దోనెల సవారీ, స్నానాలకు అనుమతి

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కావేరి నదిలో నీటి రాక 14వేల ఘనపుటడుగులకు తగ్గడంతో, హొగెనేకల్ జలపాతాలు, దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం అనుమతిచ్చింది. కొద్దిరోజులుగా కావేరి నది పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, కర్ణాటక రాష్ట్రంలోని కృష్ణరాజసాగర్ డ్యాం నుంచి కావేరి నదిలో విడుదల చేస్తున్న నీటితో కలిపి సుమారు 65వేల ఘనపుటడుగులకు పైగా వస్తుండడంతో, హొగెనేకల్ జలపాతాలు వద్ద స్నానాలు, దోనెల సవారీకి జిల్లా యంత్రాంగం నిషేధం విధించింది. కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో సోమవారానికి 18వేల ఘనపుటడుగులుగా వస్తున్న నీరు, మంగళవారం 14వేల ఘనపుటడుగులకు తగ్గింది. ఈ కారణంగా ఆరు రోజుల అనంతరం పర్యాటకులు హొగెనేకల్ జలపాతాల్లో స్నానాలు, దోనెల సవారీకి మంగళవారం నుంచి జిల్లా యంత్రాంగం అనుమతులుల జారీచేసింది.

ఈశాన్య రుతుపవనాలు

● డ్రైవర్లకు రవాణా శాఖ సూచనలు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చాయి. అలాగే, 'మొంథా' ప్రభావంతో పలు జిల్లాల్లో భారీవర్షాలు కురుస్తున్నాయి. ఈశాన్య రుతుపవనాలపై ప్రభుత్వ బస్సు డ్రైవర్లకు రవాణా శాఖ పలు సూచనలు చేసింది. వాటి వివరాలిలా ఉన్నాయి...

- దూరప్రాంతాల బస్సుల అడవి మార్గంలోని రోడ్లపై మలుపు తిప్పే సమయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. ● నీరు తక్కువగా ఉందని, బస్సు నడపాలని ప్రయాణికులు కోరినా, డ్రైవర్లు మరో మార్గంలో బస్సు తీసుకెళ్లాలి. ● బస్సు హెడ్ లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయా? రోడ్లపై విద్యుత్ తీగలు, స్తంభాలు, చెట్లు ఉన్నాయా? అనే విషయాన్ని పర్యవేక్షించాలి.
- బస్సుల్లో వర్షపు నీరు లీక్ కావడం, ఆటోమేటిక్ డోర్లు పనిచేయని పక్షంలో వెంటనే సంబంధిత డిపో మేనేజర్లకు తెలియజేయాలి. ● తీరప్రాంతాల రోడ్లపై వెళ్లే డ్రైవర్లు, వాతావరణ శాఖ ప్రకటన వినాలంటూ రవాణా శాఖ సూచించింది.

గ్రామీణ ఆప్టిట్యూడ్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై మినహా గ్రామీణ ప్రాంతాల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు గ్రామీణ ఆప్టిట్యూడ్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల శాఖ విడుదల చేసిన ప్రకటనలో... 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి చెన్నై మినహా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, పట్టణ పంచాయతీల్లోని పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నవంబరు 29వ తేది గ్రామీణ ఆప్టిట్యూడ్ పరీక్ష నిర్వహించనున్నామన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించే విద్యార్థుల్లో జిల్లాకు 50 మంది బాలురు, 50 మంది బాలికల చొప్పున ఎంపిక చేసి, ఏడాదికి రూ.1,000 చొప్పున నాలుగేళ్లు స్కాలర్ షిప్ అందజేయనున్నారు. ఈ పరీక్ష రాసేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి మంగళవారం నుంచి నవంబరు 4వ తేది వరకు దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసి, పూర్తిచేసిన దరఖాస్తుతో రూ.10 పరీక్ష ఫీజు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు నవంబరు 4 లోగా సమర్పించాలని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

1 నుంచి ఇసుక రీచ్‌లు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో నవంబరు 1వతేదినుంచి కొత్తగా 8 ఇసుక క్వారీలు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 12 ప్రాంతాల్లో నది ఇసుక క్వారీలున్నాయి. ఈ క్వారీల నుంచి యార్డ్‌కు ఇసుక తీసుకెళ్లే కాంట్రాక్టర్లు అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదులందాయి.చట్టవిరుద్ధంగా ఇసుకతరలిస్తున్నారనే ఫిర్యాదులపై ఈడీ తనిఖీలు చేపట్టడంతో, ఆ క్వారీలు మూతపడ్డాయి. అనంతరం, 30 ప్రాంతాల్లో ఇసుక క్వారీలు ప్రారంభించేందుకు జలవనరుల శాఖ చర్యలు చేపట్టింది. పర్యావరణ అనుమతులు లభించగా, కాంట్రాక్టర్లకు ఎంపిక చేయడంలో సమస్యలు నెలకొన్నాయి. ఈ క్రమంలో, పర్యావరణ అనుమతి పొందిన 8 ప్రాంతాల్లో నవంబరు 1వ తేది నుంచి ఇసుక క్వారీలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రకారం, పుదుకోటలో 3, కడలూరులో 2, తంజావూరు, నామక్కల్, రాణిపేట జిల్లాల్లో తలా ఒకటి చొప్పున ఏర్పాటుకానున్న క్వారీల్లో ఇసుక విక్రయాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆలందూరులో రూ.300 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం స్వాధీనం

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆలందూరులో లీజు గడువు ముగిసినా ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయకుండా కొనసాగుతున్న హోటల్ భవనాన్ని మంగళవారం ఉదయం అధికారులు ఎక్సకవేటర్లతో కూల్చివేశారు. ఆలందూరులో రూ.300 కోట్ల విలువైన 15 గ్రౌండ్ల ప్రభుత్వ స్థలాన్ని లీజుకు తీసుకున్న ప్రముఖ హోటల్ గ్రూప్ నిర్వాహకులు అక్కడ ఓ హోటల్ నడుపుతున్నారు. కొన్నేళ్ల క్రితం లీజు గడువు ముగిసినా ఆ స్థలాన్ని ప్రభుత్వానికి తిరిగి అప్పగించలేదు. ఈ వ్యవహారం కోర్టు దాకా వెళ్లింది. చివరకు కోర్టు తీర్పు ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చింది. ఈ ఈనేపథ్యంలో చెన్నై జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అధికారులు ఆ హోటల్ భవనాన్ని కూల్చివేసి స్థలాన్ని స్వాధీనం చేసుకునే పనులు ప్రారంభించారు. ఒకటి రెండు రోజుల్లో ఆ భవనాన్ని కూల్చివేసి స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని అధికారులు తెలిపారు.



హోటల్ భవనాన్ని కూల్చివేస్తున్న కార్మికులు

కార్మికుడి భార్య నిజాయితీ

● రోడ్డుపై దొరికిన 11.5 సవర్ల నగలు
● పోలీసులకు అందజేసిన మహిళ



బ్యాగును పోలీస్ స్టేషన్‌కు తీసుకొస్తున్న పర్వీన్

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై లభ్యమైన బంగారు నగలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన మహిళను అధికారులు అభినందించారు. సేలానికి చెందిన కార్మికుడు భాషా భార్య పర్వీన్ సోమవారం దుకాణం నుంచి ఇంటికి వెళుతుండగా, రోడ్డు పక్కన ఓ హ్యాండ్ బ్యాగ్ ఉండడం గమనించింది. ఆ బ్యాగ్‌లో చూడగా, అందులో 11.5 సవర్ల నగలు గుర్తించింది. పర్వీన్ ఆ బ్యాగును ఏడీఎస్పీ కార్యాలయంలో అప్పగించింది. ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీ పరిశీలించిన పోలీసులు, ఆ బ్యాగు సేలం సెవ్వాయిపేటకు చెందిన పూంగోద్రై అనే మహిళకు చెందిందని గుర్తించారు. పూంగోద్రైను పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు, ఆ బ్యాగును ఆమెకు అప్పగించారు. పర్వీన్‌ను పోలీసు అధికారులు, పోలీసులు, పూంగోద్రై కుటుంబ సభ్యులు అభినందించి, నగదు బహుమతి అందజేశారు.

మరుదమలై ఘాట్‌లో ఏనుగుల సంచారం

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపంలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం మరుదమలై ఘాట్‌రోడ్‌లో అడవి ఏనుగులు సంచరిస్తుండటంతో స్థానికులు, భక్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఆ ప్రాంతానికి చేరువగా ఉన్న పశ్చిమకనుమల్లోని అడవుల్లో ఏనుగులు ఇటీవల కాలంలో ఆహారం వెదుక్కుంటూ జనావాస ప్రాంతాలకు రావటం ఆనవాయితీగా మారింది. ఈ నేపథ్యంలతో మరుదమలై పర్వతాలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డులో సోమవారం సాయంత్రం మూడు గున్నఏనుగులు సహా ఆరుఏనుగులు నడచుకుంటూ వెళ్ళాయి. ఆ సమయంలో ఆలయం వద్ద వేలాదిమంది భక్తులు శూర సంహార వేడుకల్లో పాల్గొన్నారు. అటవీ శాఖ అధికారులు సమాచారం అందుకుని ఆ ప్రాంతానికి చేరుకునేలోపే ఆ ఏనుగులు పక్కనే ఉన్న అడవుల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం ఆ ఘాట్ రోడ్డు వద్ద అటవీ సిబ్బంది నిఘా వేస్తున్నారు.



మరుదమలై ఘాట్‌రోడ్డులో నడచివెళుతున్న అడవి ఏనుగులు

నగరంలో 66,117 చెట్ల కొమ్మల తొలగింపు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో 66,117 చెట్ల కొమ్మలు తొలగించారు. ఈశాన్య రుతుపవనాలతో, ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు నగర ప్రాంతం లో ప్రమాదాలు సంభవించే అవకాశమున్న చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ నెల 17వ తేది ఉదయం 8.30 నుంచి మంగళవారం ఉదయం 8.30 గంటల వరకు నగరంలో సరాసరిన 267.80 మి.మీ వర్షం కురిసింది. అదే సమయంలో, మంగళవారం ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు సరాసరిన 5.89 మి.మీ వర్షం కురిసింది. మేడవాక్కంలో అధికంగా 11.40 మి.మీ వర్షం కురవగా, అతి తక్కువగా ముగలివాక్కంలో 0.60 మి.మీ వర్షపాతం నమోదైందని తెలిపింది. జీసీసీ పరిధిలోని 15 మండలాల్లో జూలై 1 నుంచి మంగళవారం వరకు 66,117 చెట్ల కొమ్మలు తొలగించామని తెలిపింది. చెట్ల కొమ్మల తొలగింపులో 15 హైడ్రాలిక్ చెట్ల కొమ్మలు నరికే వాహనాలు, 2 హైడ్రాలిక్ నిచ్చెనలు, 224 చెట్ల కొమ్మలు కట్ చేసే యంత్రాలు వినియోగించామని తెలిపింది. ఈ నెల 17వ తేది నుంచి వివిధ ప్రాంతాల్లో కూలిన 55 చెట్లు, మంగళవారం మాత్రం నాలుగు చెట్లు తొలగించినట్లు జీసీసీ తెలిపింది.



కూలిన చెట్లు తొలగిస్తున్న దృశ్యం

గ్లెనీగల్స్ ఆస్పత్రిలో అరుదైన చికిత్స

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రోన్కైటిస్, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న లూథియానాకు చెందిన 42 ఏళ్ల వ్యక్తికి నగరంలోని గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్యులు అరుదైన చికిత్స చేశారు. సింగిల్ స్టేజ్ బైలేటరల్ రోబోటిక్ లోబెక్టమీని విజయవంతంగా అమర్చారు. పెంపుడు జంతువుల దుకాణం నిర్వహిస్తున్న లూథియానాకు చెందిన వ్యక్తి పక్షులతో ఎక్కువసేపు ఉండడంతో అతడికి శ్వాసకోశ సమస్య తలెత్తింది. నిమిషానికి ఏడు లీటర్ల వరకు నిరంతర ఆక్సిజన్ పై ఆధారపడాల్సివచ్చింది. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. దీంతో చెన్నైలోని గ్లెనీగల్స్ హాస్పిటల్‌ను సంప్రదించాడు. అతడిని పరీక్షించిన రోబోటిక్ సర్జరీ విభాగ డైరెక్టర్ డాక్టర్ గోవిని బాలసుబ్రమణి నేతృత్వంలోని వైద్యబృందం.. కీహోల్ విధానం ద్వారా ఒకే సిట్టింగ్‌లో రెండు వైపులా వ్యాధిగ్రస్తమైన లోబ్‌లను తొలగించి, ద్విపార్శ్వ రోబోటిక్ లోబెక్టమీ విజయవంతంగా నిర్వహించింది. దీనిపై డాక్టర్ బాలసుబ్రమణి మాట్లాడుతూ.. రోబోటిక్ థొరాసిక్ సర్జరీ కూడా చాలా ప్రత్యేకమైనదని, ఒక దశలో ద్విపార్శ్వ లోబెక్టమీ చేయడం చాలా అరుదని వివరించారు. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకున్నట్లు వివరించారు.

అన్నాడీఎంకే బానిస కాదు

● మాజీ మంత్రి సెల్లూరు రాజు

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ఎవరికీ బానిస కాదని ఆ పార్టీ మాజీ మంత్రి సెల్లూరు రాజు తెలిపారు. మదురైలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎంజీఆర్, జయలలిత బాటలో ఎడప్పాడి పళనిస్వామి పార్టీని సమర్థవంతంగా నడిపిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో పళనిస్వామి నేతృత్వంలో మెజార్టీ విజయం సాధించి, అధికారం చేపట్టబోతున్నామన్నారు. డెల్టా జిల్లాల ప్రజలు డీఎంకేకు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. మదురై జిల్లాలోని 10 శాసనసభ స్థానాలు అన్నాడీఎంకే కైవసం చేసుకుంటుందన్నారు. రాజకీయాల్లో తనకంటూ గుర్తింపు తెచ్చుకోవాలనే ధోరణిలో టీటీవీ దినకరన్ చెబుతున్న మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. టీవీకే కొత్త పార్టీ అని, ఆ పార్టీ డీఎంకేను ఓడించడం సాధ్యం కాదన్నారు. అందుకే డీఎంకే వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలని తాము పిలుపునిచ్చినట్లు సెల్లూర్ రాజు తెలిపారు.

● ఎన్నికల హామీల వ్యవహారం...
మంత్రి ముత్తుస్వామితో చర్చకు సిద్ధం: అన్బుమణి

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలోని 85 శాతం హామీలు నెరవేర్చినట్లు చెబుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి ముత్తుస్వామితో చర్చలకు సిద్ధంగా ఉన్నానని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి తెలిపారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో... డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలపై ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ సహా మంత్రులు వివిధ రకాలుగా మాట్లాడుతూ ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలోని 90 శాతం హామీలు నెరవేర్చామని చెబుతున్న స్టాలిన్, ఆ తర్వాత 95 శాతం, 98 శాతం, 99 శాతం అంటూ పేర్కొంటున్నారని అన్నారు. అలాగే, మంత్రులు తంగం తెన్నరసు, శివశంకర్, కొవి చెళియన్ తదితరులు డీఎంకే 505 హామీల్లో 364 హామీలు నెరవేర్చామని, ఆ ప్రకారం, 72 శాతం హామీలు నెరవేర్చినట్లు చెబుతున్నారన్నారు. డీఎంకే హామీల్లో 66 హామీలు అంటే 13 శాతం నెరవేర్చారని తాను గణాంకాలతో వెలువరించానని గుర్తుచేశారు. తాజాగా మంత్రి ముత్తుస్వామి, ఎన్నికల హామీలు నెరవేర్చామని, హామీల అమలుపై అన్బుమణి చర్చలు సిద్ధమా? అంటూ ప్రశ్నించారని, మంత్రి ఆహ్వానాన్ని తాను అంగీకరిస్తున్నానని, చర్చకు ఎక్కడకు పిలిచినా వచ్చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, ఈ చర్చ ద్వారా డీఎంకే మోసపూరిత రాజకీయాలు ప్రజలకు తెలుస్తాయని అన్బుమణి తెలిపారు.

వర్షాకాలంలో 'పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశమా'?

● బీజేపీ నేత తమిళిసై

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, డీఎంకే పార్టీ పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశం నిర్వహించడంపై బీజేపీ సీనియర్ సీనియర్ నేత తమిళిసై సౌందర్‌రాజన్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆమె తన ఎక్స్ పేజీలో... రాష్ట్రంలో వర్షాలు కురుస్తుండడంతో, ప్రజలను ఆదుకోవాల్సిన సమయంలో, బూత్ ఏజెంట్ల సమావేశం నిర్వహించడం న్యాయమా ముఖ్యమంత్రి గారూ అంటూ ప్రశ్నించారు. ఇలాంటి పార్టీకి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తమిళిసై సౌందర్‌రాజన్ తన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

చూపు కోల్పోయిన రోగి

● చెన్నై ఈఎస్‌ఐ ఆస్పత్రికి రూ.10 లక్షల జరిమానా


అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయనావరంలో ఉన్న ఆసుపత్రి నిర్లక్ష్యం కారణంగా కంటి చూపు కోల్పోయినట్లు పేర్కొంటున్న రోగికి ఈఎస్ఐ ఆస్పత్రి రూ.10 లక్షలు చెల్లించాలని జిల్లా వినియోగదారుల ఫోరం ఆదేశించింది. అయనావరంలో ధనశేఖరన్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. అతను రాష్ట్ర బీమా సంస్థలో సభ్యుడిగా ఉన్నాడు. ఈ క్రమంలో కుడి కంటిలో చూపు మందగించింది. ఆయనకు 2024లో క్యాటరాక్ట్ ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేసిన రెండు రోజుల తర్వాత వైద్యులు ధనశేఖరన్‌ను పరిశీలించారు. ఆరురోజుల అనంతరం కంటి చూపు మరింత తగ్గడంతో పాటు అలెర్జీ వచ్చింది. అతడిని కొద్దిరోజులు పర్యవేక్షించిన వైద్యులు డిశ్చార్జి చేశారు. ఇంటికి వెళ్లిన కంటి చూపు మరింత మందగించడంతో పాటు విపరీతమైన నొప్పి, అలెర్జీతో అతను ఇబ్బంది పడ్డాడు. ఆసుపత్రి సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ ధనశేఖరన్ చెన్నై ఉత్తరం వినియోగదారుల ఫోరంలో పిటిషన్ దాఖలుచేశాడు. ఈ పిటిషన్ విచారించిన ఫోరం అధ్యక్షులు డి.గోపినాథ్, సభ్యులు కవిత కన్నన్,వి.రామమూర్తితో కూడిన బృందం... ఆస్పత్రి వైద్య సేవల్లో లోపాలున్నట్లు గుర్తించారు. పిటిషనర్‌కు ఏర్పడిన మానసిక, ఆర్థిక పరమైన నష్టానికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని, ఈ నెల నుంచి రెండు నెలల్లోగా కోర్టు ఖర్చులకు రూ.10,000లను ఈఎస్ఐ ఆసుపత్రి చెల్లించాలని ఉత్తర్వులు జారీచేశారు.

అత్యాచారం కేసులో యువకుడికి 13 ఏళ్ల జైలు

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడికి కోర్టు 13 ఏళ్ల జైలుశిక్ష విధించింది. తిరువళ్లూర్ జిల్లా ఒరగడం ప్రాంతానికి చెందిన అళగరసన్ 2019 మార్చి 25న ఓ ఇంట్లో చొరబడి 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ వ్యవహారంపై బాలిక తల్లి ఫిర్యాదుతో ఆవడి మహిళా పోలీసులు, కేసు నమోదుచేసి అళగరసన్‌ను అరెస్ట్ చేసి తిరువళ్లూర్ కోర్టులో హాజరుపరచి పుళల్ జైలుకు తరలించారు. ఈ కేసు విచారణ పూర్తికావడంతో నేరం నిరూపణ కావడంతో అళగరసన్‌కు 13 ఏళ్ల జైలుశిక్ష, రూ.16,000 జరిమానా విధిస్తూ తిరువళ్లూర్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఉమామహేశ్వరి తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత బాలికకు రూ.3 లక్షల పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

'ఆన్‌లైన్' వ్యాపారంలో నష్టం

కుమారుడిని హతమార్చి తండ్రి ఆత్మహత్య ● ప్రాణాపాయ స్థితిలో భార్య



చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ వ్యాపారంలో నష్టం రావడంతో, ఏడేళ్ల కుమారుడి గొంతు నులిమి హతమార్చిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి.. రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడగా, గొంతు కోసిన స్థితిలో ఆయన భార్య ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.. వివరాలిలా వున్నాయి... అన్నానగర్ 18వ మెయిన్ రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న నవీన్ కన్నన్ (38) తేనాంపేటలోని కేంద్ర ప్రభుత్వ అకౌంటింగ్ కార్యాలయంలో సీనియర్ ఆడిటర్‌గా, ఆయన భార్య నివేదిత (34) పెరంబూర్‌లోని దక్షిణ రైల్వే లోకో కార్యాలయంలో అధికారిగా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు లివిన్ (7) అనే కుమారుడున్నాడు. నవీన్ కన్నన్ తల్లి భువనేశ్వరి, తండ్రి కూడా వీరితో ఉంటున్నారు. నవీన్ కన్నన్ సోమవారం బయటకు వెళ్లాడు. కొద్దిసేపటి తర్వాత తల్లికి ఫోన్ చేసి గదిలో భార్యా, కుమారుడు నిద్రపోతున్నారని, వారిని కదిలించవద్దని చెప్పాడు. కొద్దిసేపటి తరువాత భువనేశ్వరికి నివేదిక తల్లి ఫోన్ చేసింది. తన కుమార్తె ఫోన్ తీయడం లేదేమని అడిగింది. దీంతో అనుమానించిన భువనేశ్వరి నివేదిక గదిలోకి వెళ్లి చూసి, దిగ్భ్రాంతికి గురైంది. అక్కడ లివిన్ నిశ్చలంగా పడివుండగా, నివేదిక గొంతు కోయబడి, రక్తపు మడుగులో మంచంపై పడి వుంది. దీంతో భువనేశ్వరి చుట్టుపక్కల వారిని పిలిచి కోడల్ని, మనవడ్ని కీల్పాక్ ఆస్పత్రికి తీసుకెళ్లింది. కానీ అప్పటికే లివిన్ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. సమాచారం అందుకున్న తిరుమంగళం పోలీసులు కేసు నమోదుచేసి నవీన్ కన్నన్ కోసం గాలించారు. అంతలో, ఉదయం 11 గంటలకు విల్లివాక్కం-కొరట్టూరు శతాబ్ది ఎక్స్‌ప్రెస్ కింద పడి నవీన్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో అతడి మృతదేహాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నవీన్‌పై పలు అవినీతి ఫిర్యాదులున్నాయని, అతను ఆన్‌లైన్ వ్యాపారంలో లక్షలాది రూపాయలు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. అప్పుల బాధ తాళలేకే అతను కొడుకు, భార్యను హత్య చేసి, తానూ ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు.

అదానీ ఏమడిగినా మోదీ ఇచ్చేస్తారు

● స్పీకర్ అప్పావు ఎద్దేవా

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అదాని ప్రధాని మోదీకి పెంపుడు జంతువు లాంటి వాడని, ఆయన ఏమి అడిగినా మోదీ వెంటనే ఇచ్చేస్తారని స్పీకర్ అప్పావు ఎద్దేవా చేశారు. తిరునల్వేలిలో మంగళవారం స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో అభివృద్ధి పనులు, ప్రాజెక్ట్‌లకు నిధులు ఇవ్వడంలో కేంద్ర ప్రభుత్వం పక్షపాత ధోరణి చూపుతుందన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం స్టాలిన్ నేతృత్వంలోని కూటమి ఘనవిజయం సాధించి మళ్లీ అధికారం చేజిక్కించుకుంటుందన్నారు. మోదీకి అదాని పెంపుడు జంతువు లాంటి వాడని, ఆయన విమానాశ్రయం సహా ఏది అడిగినా మోదీ వెంటనే ఇస్తారన్నారు. ఎల్ఐసీలో అదనపు వాటా అడిగినా మోదీ వెంటనే ఇచ్చేస్తారన్నారు. ప్రతి ఒక్కరికీ వేర్వేరు అలవాట్లు ఉంటాయన్నారు. సీఎం స్టాలిన్ అలవాటు ఏమిటంటే, రాత్రి పూట కూడా ప్రజలకు సేవ చేసేందుకు వెళ్లాలని ఉంటుందన్నారు. అదే సమయంలో నటుడు విజయ్‌కు కూడా ఒక అలవాటు ఉందన్నారు. ఎప్పుడూ నిద్రపోవాలి, ఎప్పుడు తింటూ ఉండాలి తదితరాలు విజయ్‌కు ఉన్నాయని, అందుకు అనుగుణంగానే విజయ్ వ్యవహరిస్తుంటారని స్పీకర్ అప్పావు చలోక్తి విసిరారు.

మొబైల్ జారిందని... చైన్ లాగితే జరిమానా

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి మొబైల్ ఫోన్ జారిపడిందని, అత్యవసర చైన్ లాగిన ప్రయాణికులకు జరిమానా విధిస్తామని రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) హెచ్చరించింది. ఈ మేరకు ఆర్పీఎఫ్ విడుదల చేసిన ప్రకటనలో... రైళ్లలో ప్రయాణించే వారు సెల్‌ఫోన్ కింద పడిందని, రైలులోని ఎమెర్జెన్సీ చైన్ లాగుతున్నారని తెలిపింది. ఇలాంటివి చేయకూడదని హెచ్చ రించింది.. సెల్‌ఫోన్, విలువైన వస్తువులు రైలు నుంచి జారిపడిన సమయంలో, రైలు నెంబరు, వస్తువు పడిన ప్రాంతాల వివరాలను రైల్వే సహాయ నెంబరు 139, 182కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా రైల్వే పోలీసులు సంబంధిత ప్రాంతాల్లో గాలించి, వస్తువు స్వాధీనం చేసుకుని వాటి యజమానులకు అప్పగిస్తామని తెలిపింది. ఒకవేళ దొంగలు మొబైల్, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులు చోరీ చేసి పరారైన సమయంలో, ప్రయాణికులు అత్యవసర చైన్ వినియోగించవచ్చని తెలిపింది. ఈ నిబంధనలు అతిక్రమించిన ప్రయాణికులకు రూ.1,000 జరిమానా విధిస్తామని ఆర్పీఎఫ్ హెచ్చరించింది.

బాణసంచా ప్రమాదంలో దృష్టి కోల్పోయిన 81 మంది

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా టపాసులు కాల్చుతున్న సమయంలో సుమారు 5వేల మంది గాయపడి, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సల కోసం చేరారు. వారిలో, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అరవింద కంటి వైద్యశాలల్లో 776 మంది చికిత్స కోసం చేరగా, 81 మంది దృష్టి కోల్పోయారు. మదురైలో అధికంగా 29 మంది, కోవైలో 17, పుదుచ్చేరిలో 11, తిరునల్వేలిలో ఏడుగురు, చెన్నైలో ఆరు మంది దృష్టి కోల్పోయారని వైద్యులు తెలిపారు. ఆరోగ్య శాఖ గణాంకాల మేరకు 2023వ సంవత్సరంలో 397 మంది కంటి చికిత్స పొందగా, 45 మంది చూపు కోల్పోయారు. అలాగే, 2024లో 439 చికిత్స పొందగా 40 మంది చూపు కోల్పోయారు. ఈ ఏడాది 776 మంది కంటి చికిత్సలు పొందగా 81 మంది చూపు కోల్పోయారని గణాంకాలు తెలుపుతున్నాయి.

నాన్న ఇష్టపడితే ఎన్నికల్లో పోటీ చేస్తా

● రాందాస్ కుమార్తె శ్రీకాంతి

పెరంబూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాన్న ఇష్టపడితే ఎన్నికల్లో పోటీ చేస్తానని రాందాస్ కుమార్తె శ్రీకాంతి తెలిపారు. పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్, ఆయన కుమారుడు అన్బుమణి మధ్య కొద్ది నెలలుగా విభేధాలు నెలకొన్నాయి. ప్రస్తుతం పార్టీలో రాందాస్ ఒక వర్గం, అన్బుమణి మరో వరంగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఇటీవల ధర్మపురిలో జరిగిన పార్టీ సర్వసభ్య మండలిలో తన పెద్దకుమార్తె శ్రీకాంతిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్లు రాందాస్ ప్రకటించారు. ఈ క్రమంలో, శ్రీకాంతి మీడియాతో మాట్లాడుతూ.. తనకు ఎంపీ, ఎమ్మెల్యే కావాలనే ఉద్దేశం లేదన్నారు. అదే సమయంలో తండ్రి కోరితే రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తానని తెలిపారు. ప్రస్తుతం అన్బుమణికి పార్టీ, చిహ్నం, జెండా ఎన్నికల సంఘం కేటాయించిందని, అందుకు వారు 10 రోజుల్లోగా తగిన పత్రాలు సమర్పించాలని ఎన్నికల సంఘం కోరిందన్నారు. కానీ, రాందాస్ తగిన ఆధారాలతో ఎన్నికల సంఘానికి పత్రాలు అందజేసినా, అన్బుమణికి ఎన్నికల సంఘం అంగీకరించిందన్నారు. దీంతో రాందాస్ మనోవేదనకు గురయ్యారని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీలో చురుగ్గా వ్యవహరించాలని నిర్ణయించినట్లు, వచ్చే వారంలో కడలూరులో పార్టీ నిర్వాహకుల కమిటీ సమావేశం ఏర్పాటుచేయనున్నామన్నారు. ఏ కూటమిలో చేరాలి అన్న విషయమై రాందాస్ చర్చలు జరుపుతున్నారని, అందుకు సంబంధించి ప్రకటన తగిన సమయంలో ఆయన ప్రకటిస్తారని శ్రీకాంతి తెలిపారు.

డీఎస్పీపై దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ కేసులో డీఎస్పీ కార్తికేయన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో తెన్‌కాశి హనీఫాకు ఐదేళ్ల జైలుశిక్షను న్యాయస్థానం విధించింది. బీజేపీ సీనియర్ నేత ఎల్కే అద్వానీ 2011లో రాష్ట్రంలో రథయాత్ర చేపట్టారు. ఆ సమయంలో, మదురై జిల్లా తిరుమంగళం అలంపట్టి సమీపంలోని వంతెన కింద బాంబు ఉంచి ఆయనను హతమార్చే ప్రయత్నం జరిగింది. ఈ వ్యవహారానికి సంబంధించి తిరుమంగళం పోలీసులు మహ్మద్ హనీఫా అలియాస్ తెన్‌కాశి హనీఫా సహా పలువురిపై కేసు నమోదుచేశారు. తెన్‌కాశి హనీఫాకు బెయిలుపై విడుదల కాకుండా న్యాయస్థానం పీడీ వారెంట్ జారీచేసింది. ఈ క్రమంలో, వత్తలగుండు సమీపంలో దాగిన తెన్‌కాశి హనీఫాను ఎస్ఐటీ డీఎస్పీ కార్తికేయన్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం చుట్టుముట్టింది. ఆ సమయంలో, అతను డీఎస్పీపై కత్తితో దాడిచేసి తప్పించుకునేందుకు యత్నించాడు. ఈ ఘటనపై వత్తలగుండు పోలీసులు అతడిపై హత్యాయత్నం కేసు నమోదుచేశారు. హనీఫా నుంచి మతగురువుల పేర్లతో కూడిన జాబితా, పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు దిండుగల్ ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు విచారణ ముగిసిన నేపథ్యంలో, హనీఫాను కేసు నుంచి విడిపిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ఈ తీర్పు వ్యతిరేకిస్తూ సీబీసీఐడీ-ఎస్ఐటీ అదనపు ఎస్పీ తరపున హైకోర్టు మదురై బెంచ్‌లో అప్పీలు పిటిషన్ వేశారు. న్యాయమూర్తులు జస్టిస్ పి.వేల్ మురుగన్, జస్టిస్ విక్టోరియా గౌరిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్ విచారణ చేపట్టగా, ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది... ఈ కేసులో అన్ని సాక్ష్యాధారాలు సమర్పించామని, స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలు కూడా నిజమైనవని తెలిసిందని, అందువల్ల దిండుగల్ కోర్టు ఇచ్చిన తీర్పు రద్దు చేయాలని కోరారు. అనంతరం ధర్మాసనం, ఈ కేసు నుంచి హనీఫాను విడిపిస్తూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేసిన హైకోర్టు, తీర్పు మంగళవారం (ఈనెల 28వ తేది)వాయిదావేసింది. ఆ ప్రకారం, మంగళవారం కోర్టుకు హనీఫా హాజరయ్యాడు. అనంతరం, డీఎస్పీ కార్తికేయన్‌పై కత్తితో దాడిచేసి తప్పించుకునేందుకు యత్నించిన తెన్‌కాశి హనీఫాకు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

● ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసు..
సుప్రీంకోర్టులో పొర్కొడి మధ్యంతర పిటిషన్

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో ఆయన భార్య పొర్కొడి సుప్రీంకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలుచేసింది. ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు విచారణ సీబీఐకి మార్చడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలైంది. అలాగే, సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ ఆమ్‌స్ట్రాంగ్ భార్య పొర్కొడి తరపున సుప్రీంకోర్టులో మధ్యంతర పిటిషన్ దాఖలైంది. అందులో... మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీ ఏర్పాటుచేసి సీబీఐ విచారణ పర్యవేక్షించాలని పిటిషన్‌లో కోరారు.

త్రిపుర మహిళపై అత్యాచారం

● అద్దె బైకు డ్రైవర్ అరెస్టు

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వానగరం వద్ద త్రిపుర రాష్ట్రానికి చెందిన మహిళ (22)పై అత్యాచారానికి పాల్పడిన తేని జిల్లాకు చెందిన శివకుమార్ (22) అనే అద్దె బైకు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి ఆ మహిళ అద్దె బైక్‌ను బుక్ చేసుకుని పళ్ళికరణైలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్ళింది. ఆ మహిళ మరునటి రోజు ఉదయం తనను పికప్ చేసుకుందుకు రమ్మని ఆ అద్దెబైకు డ్రైవర్ తెలిపింది. ఆ ప్రకారమే సోమవారం వేకువజామున బైకులో ఆ మహిళను వానగరం ప్రాంతానికి తీసుకెళ్తూ మార్గమధ్యంలో చంపుతానని బెదరించిన శివకుమార్ ఆమెపై అత్యాచారం జరిపి పారిపోయాడు. ఈ సంఘటన గురించి మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని శివకుమార్‌ను అరెస్టు మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి మంగళవారం సెంట్రల్ జైలుకు తరలించారు.

చిత్రజ్యోతి

వీజే సిద్ధూ దర్శకత్వంలో 'దయంగరం'

వీజే సిద్ధూ దర్శకత్వంలో 'దయంగరం' పేరుతో తెరకెక్కే సినిమా సంప్రదాయ పూజా కార్యక్రమంతో సోమవారం నగరంలో ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత, వేల్ గ్రూపు విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఐసరి కె.గణేష్ ఈ సినిమాకు తొలి క్లాప్‌కొట్టి షూటింగ్ ప్రారంభించారు. ఈ మూవీ ద్వారా ప్రముఖ యూట్యూబర్ వీజీ సిద్ధూ తొలిసారి దర్శకత్వ బాధ్యతలను చేపట్టి నటిస్తున్నారు. మూవీ ప్రారంభోత్సవ కార్యక్రమం తాజా ప్రారంభించగా, షూటింగ్ ఎపుడు మొదలు పెడతారన్నది మాత్రం వెల్లడించలేదు. సోమవారం జరిగిన ఈ చిత్రం పూజా కార్యక్రమంలో చిత్ర పరిశ్రమకు చెందిన అనేక సినీ ప్రముఖులతో పాటు ఈ సినిమాలో నటించే నట్టి నటరాజ్, కాళి వెంకట్, ఇలవరసు, నితిన్ సత్య, హర్షద్‌ఖాన్, కదిర్ తదితరులు పాల్గొన్నారు. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఈ సినిమాను నిర్మాత కె.గణేష్ తెరకెక్కిస్తున్నారు. నేటి యువత ప్రతిభాపాటవాలను ఇతివృత్తంగా తీసుకుని కామెడి, ఎమోషన్‌తో మంచి చిత్రంగా రూపొందించనున్నట్టు దర్శక నిర్మాతలు వెల్లడించారు.



పూజా కార్యక్రమంలో చిత్ర బృందం

31న విడుదలవుతున్న 8 చిత్రాలు

ఈ నెల 31వ తేదీ ఏకంగా ఎనిమిది చిత్రాలు విడుదలకు సిద్ధమయ్యాయి. సాధారణంగా దీపావళికి ఎక్కువ సినిమాలు రిలీజ్ అవుతుంటాయి. కానీ, ఈ యేడాది దీపావళికి కేవలం 5 చిత్రాలు మాత్రమే ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ఈ చిత్రాలు విడుదలై కూడా రెండు వారాలు గడిచిపోయింది. ఈ సినిమాలు చూసేందుకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య కూడా బాగా తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో అక్టోబరు నెల 31న 8 చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 'ఆన్ పావం పొల్లాదదు', 'ఆర్యన్', 'మెసెంజర్' 'పరిసు', 'రామ్ అబ్దుల్లా ఆంటోనీ', 'తడై అధై ఉడై', 'దేశీయ తలైవర్', 'పట్టకానల్' ఉన్నాయి. ఆయా నిర్మాతలు తమ చిత్రాలను ఎక్కువ థియేటర్లలో విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.


వాణీ భోజన్, విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్

సినిమాకు స్క్రీన్‌ప్లే నే హీరో

● దర్శకుడు శివనేశన్

తన సినిమాకు స్క్రీన్ ప్లే మాత్రమే హీరో అని నూతన దర్శకుడు శివనేశన్ అభిప్రాయపడ్డారు. 'కాళిదాస్' వంటి విజయవంతమైన చిత్రాన్ని నిర్మించిన ఇన్‌క్రెడిబుల్ ప్రొడక్షన్స్ పతాకంపై సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్‌లో ఒక చిత్రం రూపుదిద్దుకోనుంది. సినిమా ప్రారంభం నుంచి ముగింపు వరకు ప్రేక్షకులను ఉత్కంఠకు లోనుచేసేలా సీట్‌ఎడ్జ్ థ్రిల్లింగ్ మూవీగా తెరకెక్కించనున్నారు. ఈ మూవీ ద్వారా 'నాళయ ఇయ్యక్కునర్-4' సీజన్‌కు చెందిన శివనేశన్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సినిమా వివరాలను ఆయన వివరిస్తూ, ' సినిమాకు నటీనటుల కంటే స్క్రిప్టు ముఖ్యం. ఒక్క మాటలో చెప్పాలంటే స్క్రిప్టే కథానాయకుడు. ప్రేక్షకులను చివరి సన్నివేశం వరకు ఉత్కంఠకు లోనుచేసేలా స్క్రీన్‌ప్లే ఉంటుంది. ఇందులో కిషోర్, చార్లీ, చారుకేష్, వినోద్ కిషన్ తదితరులు ప్రధాన పాత్రలను పోషించారు. సురేష్ బాలా సంగీతం అందించే ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీత దర్శకత్వం వహించారు.


కొత్త చిత్రం ప్రారంభోత్సవ దృశ్యం

ఆగని వర్షం...


ఎర్నావూరు భారతియార్‌నగర్ తీరంలో పడవలను గుట్టపైకి ఎక్కిస్తున్న జాలర్లు


ఆవడి నత్తమేడు చెరువు సమీపంలో ఇళ్ల చుట్టూ చేరిన వర్షపునీరు


టి.నగర్‌లో వర్షంలోనే వెళుతున్న వాహనాలు

సాగని జనజీవనం

● లోతట్టు ప్రాంతాలు జలమయం

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పక్షం రోజులుగా చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం 6 నుండి మంగళవారం మధ్యాహ్నం 2 గంటల వరకు (32 గంటలపాటు) నగరం, శివారు ప్రాంతాల్లోనూ నిరాటంకంగా వర్షం కురిసింది. వర్షాలకు జనజీవనం స్తంభించింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు దీవులను తలపిస్తున్నాయి. ఆవడి, మధువాయల్, పూందమల్లి, వాషర్‌మెన్‌పేట, తండయార్‌పేట, మనలి తదితర శివారు ప్రాంతాల్లో రెండు రోజుల వర్షానికి పల్లపు ప్రాంతాల్లో ఉన్న నివాసగృహాలన్నీ జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నగరంలోను, శివారు ప్రాంతాల్లోనూ పెనుగాలులు లేకుండా వర్షం కురవటం వల్ల అధిక సంఖ్యలో చెట్లు కూలలేదని కార్పొరేషన్ అధికారులు తెలిపారు. ఎన్నూరులో 13 సెం.మీ. కత్తివాక్కం వద్ద 10 సెం.మీ.లు, విమ్కోనగర్‌లో 9 సెం.మీ.లు, మాధవరం, మణలి పుదునగర్, మేడవాక్కం ప్రాంతంలో 8 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది. పొన్నేరి, అంబత్తూరు, బేసిన్‌బ్రిడ్జ్, ఆవడి, పెరంబూరు, తండయార్‌పేట ప్రాంతాల్లో 7 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. వర్షాలకు పల్లపు ప్రాంతాల్లో సుమారు 4వేలకు పైగా ఇళ్లు జలదిగ్బంధంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆవడి, పట్టాభిరామ్, తిరునిండ్రవూరు ప్రాంతాల్లో వర్షాలకు పల్లపు ప్రాంతాలు దీవులుగా మారాయి. ఆవడి కార్పొరేసణ్ పరిధిలో కోవిల్‌పతాగై, 20, 37 వార్డులు, పట్టాభిరామ్ గోపాలపురం, తెండ్రల్ నగర్ ప్రాంతాల్లో సుమారు 2 వేల నివాసగృహాల చుట్టూ వర్షపునీరు అడుగులోతున ప్రవహిస్తోంది. ఇదేవిధంగా తిరునిండ్రవూరు మునిసిపాలిటీ 21, 27 వార్డుల పరిధిలో ఉన్న అన్నై ఇందిరా నగర్, మహాలక్ష్మీనగర్, శ్రీనివాసనగర్, హిమ్మత్‌నగర్, ఎల్ఐసీ నగర్, తిరువేంకటనగర్ తదితర ప్రాంతాల్లో సుమారు వెయ్యిళ్ల చుట్టూ మొలలోతు వర్షపునీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఓ వైపు వర్షం, మరోవైపు రెండోదశ మెట్రోరైలు సొరంగ మార్గం పనులు, ఇంకో వైపు రహదారుల్లో ఏర్పడిన గోతుల కారణంగా నగరంలో సోమవారం రాత్రి పలు ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అన్నాసాలై, గిండి, పూందమల్లి, క్రోంపేట జీఎస్టీ రోడ్డు, ఈస్ట్‌కోస్ట్‌రోడ్డు, తిరువాన్మియూరు, అడయార్, పట్టినంబాక్కం, మెరీనాబీచ్ ప్రాంతం తదితర ప్రాంతాల్లో సోమవారం రాత్రి నుండి మంగళవారం మధ్యాహ్నం వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఇదే విధంగా పూందమల్లి హైరోడ్డు, మందవెల్లి, మైలాపూరు ప్రాంతాల్లో తరచూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుఫాన్ తీరం దాటనున్న కారణంగా కాశిమేడు, పట్టినంబాక్కం, శ్రీనివాసపురం ప్రాంతాల్లో జాలర్లు చేపలవేట మానుకున్నారు. తీరం సమీపంలోని పడవలన్నింటినీ మిట్ట ప్రాంతాలకు తరలించే పనుల్లో తలమునకలయ్యారు.


వ్యాసార్పాడిలో ఓ వీధిలో ప్రవహిస్తున్న వర్షపునీరు


ఎన్నూరు రహదారి వద్ద ఇసుకబస్తాలు పేరుస్తున్న కార్మికులు


వర్షానికి చెరువును తలపిస్తున్న మెరీనాబీచ్ ప్లే ఏరియా

మోటారు పంపులతో వాననీటి తొలగింపు

● యుద్ధప్రాతిపదికన జీసీసీ సహాయ కార్యక్రమాలు ● పరిశీలించిన డిప్యూటీ సీఎం

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలో గత రెండు రోజులుగా ప్రధానరహదారులు, వీధుల్లో వరదలా ప్రవహించిన వాననీటిని 1496 మోటారు పంపుల ద్వారా తొలగించినట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. 15 జోన్లలో వాననీరు అధికంగా చేరే ప్రాంతాలను గుర్తించి హెవీ మోటారు పంపులు, 550 ట్రాక్టర్లను ఉపయోగించి వాననీటిని యుద్ధ ప్రాతిపదికన తొలగిస్తున్నట్టు తెలిపారు. వాననీటి కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించడానికి 7 సూపర్ సక్కర్ వాహనాలను కూడా ఉపయోగించినట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల వరకు కార్పొరేషన్ పరిధిలో 22 ట్రాక్టర్లు, పంపులు ద్వారా వాననీటిని తొలగించినట్లు ప్రకటించారు. ఇదిలా ఉండగా ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మంగళవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సందర్భంగా నగరంలో ప్రధాన సబ్‌వేలలో వాననీరు చేరకుండా మోటారు పంపులతో తొలగించే పనులను ఆయా సబ్‌వేల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించారు.


రిప్పన్ భవనంలోని కంట్రోల్ రూమ్ నుంచి నగరంలోని ప్రధాన సబ్‌వేలను పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి ఉదయనిధి



మాధవరం ఆంటోనియార్ ఆలయం రెండోవీధిలో మోటార్లతో వాననీటిని తొలగిస్తున్న కార్మికుడు

54 వేలమందికి అల్పాహారం...

ఇదిలా ఉండగా నగరంలో కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సురక్షిత శిబిరాల్లో ఉంటున్న 54 వేల మంది వర్షబాధితులకు మంగళవారం ఉదయం అల్పాహారం పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. 9 వంట శాలల్లో తయారైన అల్పాహారాన్ని తిరువొత్తియూరు జోన్‌లో 10 వేల మందికి, మణలి జోన్‌లో 5వేలమందికి, మాధవరం జోన్‌లో 3500 మందికి, తండయార్‌పేట జోన్‌లో 18 వేల మందికి, రాయపురం జోన్‌లో 17 వేల మందికి, పెరుంగుడి జోన్‌లో వంద మందికి అల్పాహారం అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 22 నుంచి మంగళవారం ఉదయం వరకు 4లక్షల 66 వేల 650 మందికి అల్పాహారం పంపిణీ చేసినట్లు కార్పొరేషన్ ఉన్నతాధికారులు తెలిపారు.


పెరియార్‌నగర్ సెకెండ్ మెయిన్ రోడ్డులో వాననీటిని తొలగిస్తున్న కార్మికులు

భారీవర్షాలతో నిండిన కుశస్థలి నది



తిరుత్తణి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల్లో అత్యధికంగా తిరుత్తణిలో 50 మి.మీ వర్షపాతం నమోదైంది. అదే సమయంలో, బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను కారణంగా తిరువళ్లూరు జిల్లాలో ఆదివారం నుంచి భారీవర్షాలు కురుస్తున్నాయి. పొదటూరుపేట, పళ్లిపట్టు తదితర ప్రాంతాల్లోను భారీ వర్షం కురిసింది. ఈ నేపథ్యంలో తిరుత్తణి సమీపంలోని కుశస్థలి నది సహా సబ్ డివిజన్ నీటిపారుదలశాఖకు చెందిన సుమారు 79 చెరువులకు గానూ 31 చెరువుల్లో నీరు పూర్తిసామర్థ్యానికి చేరింది. దీనితో పంటసాగుకు ఎలాంటి ఎద్దడిలేకుండా నీటివనరులు ఏర్పడంతో జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి తిరుకల్యాణం


దేవేరులతో సుబ్రహ్మణ్యస్వామి - మంగళసూత్రాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం

తిరుత్తణి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయంలో శ్రీవల్లీ,దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి తిరుకల్యాణమహోత్సవం మంగళవారం సాయంత్రం అశేషభక్తజనం నడుమ నేత్రపర్వంగా జరిగింది. స్కందషష్ఠి వేడుకలను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా మురుగన్ ఆలయాల్లో జరుగుతున్న ఈ వేడుకల్లో ప్రతిరోజు స్వామివారిని విశేషంగా అలంకరించి ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఆలయ అర్చకులు ఊరేగించారు. ఈ క్రమంలో తిరుత్తణిలో ఈ నెల 22 నుంచిమొదలైన స్కందషష్ఠి వేడుకలు మంగళవారం సాయంత్రం తిరుకల్యాణంతో ముగిశాయి. కాగా, మంగళవారం సాయంత్రం 4.30గంటలకు ఆలయ కమిషనర్ రమణి, ఆలయ ధర్మకర్త, ట్రస్టీ శ్రీధరన్, వైస్‌చైర్మన్ సురేష్, మాజీ కార్యదర్శి తిరుత్తణి భూపతి తదితరులు ఎంపీసీ రోడ్డు నుండి పుష్పాలు, మంగళసూత్రాలను ఊరేగింపుగా కల్యాణమండపానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్ల ఉత్సవమూర్తులను అర్చకులు అలంకరించి వేదమంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ తిరుకల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుక చూసేందుకు భక్తులు కావళ్లతో ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.

కబడ్డీ క్రీడాకారిణికి ఈపీఎస్ అభినందన

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)ని కబడ్డీ క్రీడాకారిణి కార్తీక కలుసుకున్నారు.. ఇటీవల బహ్రెయిన్‌లో జరిగిన ఆసియా పోటీల్లో కబడ్డీ విభాగంలో భారత్ తరఫున పాల్గొన్న పురుషులు, మహిళల జట్లు బంగారం పతకాలు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఆ రెండు జట్లలో రాష్ట్రానికి చెందిన అభినేష్, కార్తీక క్రియాశీలకంగా వ్యవహరించడంతో పాటు బంగారు పతకం సాధించడంలో ప్రధాన పాత్ర పోషించారు. సోమవారం నగరానికి చేరుకున్న అభినేష్, కార్తీక ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసి ఆశీస్సులు పొందారు. వారిని అభినందించిన సీఎం.. చెరి రూ.25 లక్షలు ప్రోత్సాహక నిధిగా అందజేశారు. ఈ నేపథ్యంలో క్రీడాకారిణి కార్తీక మంగళవారం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామిని కలిసారు. ఈ విషయమై ఈపీఎస్ తన ఎక్స్ పేజీలో... 'ఆసియా యూత్ గేమ్స్‌లో విజయం సాధించిన భారత క్రీడాకారుల్లో ఒకరైన స్థానిక కన్నగి నగర్‌కు చెందిన కార్తీకకు ఆశీస్సులు తెలిపి అభినందించాను. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఆమె, తన ప్రతిభ, పట్టుదలతో కబడ్డీ ఆటలో రాణిస్తున్న కార్తీక, మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గౌరవం చేకూర్చాలని ఆశీర్వదించినట్లు' ఈపీఎస్ ట్వీట్ చేశారు.


కార్తీకను అభినందిస్తున్న ఈపీఎస్

వారాంతపు సెలవుల్లో ప్రత్యేక బస్సులు

అడయార్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్‌ఈటీసీ) ప్రత్యేక బస్సులు నడుపనుంది. ఈ మేరకు ఎస్‌ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో... కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి ఈ నెల 31వ తేది 340 ప్రత్యేక బస్సులు, నవంబరు 1వ తేది 350 బస్సులు నడుపనున్నారు. కోయంబేడు బస్ టెర్మినల్ నుంచి 31, నవంబరు 1వ తేదీల్లో తలా 55, మాధవరం బస్ టెర్మినల్ నుంచి 31,1వ తేదీల్లో తలా 20 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. అలాగే, బెంగళూరు, తిరుప్పూర్, ఈరోడ్, కోవై తదితర ప్రాంతాల నుంచి ఇతర నగరాలకు 100 ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్‌ఈటీసీ తెలిపింది.

పెరిగిన హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్స్ నికర లాభం


చైర్మన్ చంద్రమోహన్

చెన్నై, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రైవేట్ రంగ పాల ఉత్పత్తి సంస్థ అయిన హట్సన్ ఆగ్రో ప్రొడక్ట్స్ సెప్టెంబరు 30తో ముగిసిన త్రైమాసిక, అర్ధ సంవత్సరానికి సంబంధించిన తన ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ఇందులో తన కార్యకలాపాల ద్వారా రూ.2,427.59 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది. ఇది తొలి త్రైమాసికంతో పోలిస్తే 17.6 శాతం ఎక్కువని సంస్థ చైర్మన్ ఆర్జీ చంద్రమోహన్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఇది తమ పనితీరును గతంలో తాము చేసిన స్థిరమైన పునాది బలాన్ని, క్రమశిక్షణా విధానాన్ని ప్రతిబింబిస్తుందని తెలిపారు.

తిరుమల అడవుల్లో అరుదైన బల్లి

● వెంకటాద్రిగా నామకరణం



మంగళం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండల్లో అరుదైన ఒక బల్లిజాతిని గుర్తించారు. దట్టమైన చందనపు అడవిలో చెట్టు బెరడు కింద దీనిని జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనికి వెంకటాద్రి స్లెండర్ గెక్కో అని పేరు కూడా పెట్టారు. పలుచని తొండలా కనిపించే బల్లిజాతి జీవి ఇది. హెర్పటోజోవా అనే అంతర్జాతీయ జర్నల్‌లో ఈ వివరాలను శాస్త్రవేత్తలు ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్రెష్‌వాటర్ బయాలజీ రీజనల్ సెంటర్, కోల్‌కత్తకి చెందిన రెప్టిల్లా విభాగం, ఒడిస్సాలోని ఫకీర్ మోహన్ యూనివర్శిటీల శాస్త్రవేత్తల బృందం శేషాచలం అడవుల్లో దీనిని గుర్తించింది.

శ్రీవారిసేవలో ప్రముఖులు





అభిమానితో సెల్ఫీ తీసుకుంటున్న అజిత్ - అన్మోల్ అంబానీ, క్రిషా షా అంబానీ దంపతులు

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో, తమిళ హీరో అజిత్, ప్రముఖ పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీ కుమారుడు అన్మోల్ అంబానీ, ఆయన సతీమణి క్రిషా షా అంబానీ ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 17 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.47 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,842

తలనీలాలు సమర్పించినవారు: 25,125



వాన.. గాలి.. చలి!



తిరుమలకు శ్రీనివాసుడి దర్శనానికి వస్తున్న భక్తులకు విడవని వానలతో అవస్థలు తప్పడంలేదు. తల తడవకుండా గొడుగు విప్పితే ఈదురు గాలులకు తిరగబడిపోతున్నాయి. మరోవైపు చలి వణికిస్తోంది. ఆలయం పరిసరాల్లో మంగళవారం పగలు కనిపించిన దృశ్యాలు ఇవి.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, తిరుపతి ఆంధ్రజ్యోతి

అత్యవసర వేళ విధులకు డుమ్మా!

- పలు సచివాలయాలకు తాళాలు
- అందుబాటులో లేని అధికారులు, ఉద్యోగులు
- కలెక్టర్ పరిశీలనలో వెల్లడి



తడ మండలం పూడి సచివాలయానికి తాళాలు వేసి ఉండటాన్ని సెల్‌ఫోన్ లైటింగ్‌లో చూపుతున్న తహసిల్దారు

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): 'మొంథా' తుఫాను ముంచుకొస్తున్న అత్యవసర వేళ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాల్సిన పలువురు అధికారులు, ఉద్యోగులు డుమ్మా కొడుతున్నారు. గ్రామ సచివాలయాలకే కాదు మండల స్థాయి కార్యాలయాలకూ తాళాలు వేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించేందుకు జిల్లా అధికారులు ప్రయత్నిస్తే పలువురు అందుబాటులో వుండడం లేదు. కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలనలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. తుఫాను నేపథ్యంలో సోమవారం రాత్రి ఎంపీడీవోలు, తహసిల్దార్లు కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సచివాలయాల్లో కార్యదర్శులూ విధుల్లో వుండాలని ఐదుగురికి చొప్పున డ్యూటీ వేశారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో కలెక్టర్ వెంకటేశ్వర్ చిత్తూరు, నెల్లూరు జడ్పీల సీఈవోలతో కలసి మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. చిట్టమూరు ఎంపీడీవో స్థానికంగా లేరని, వాకాడులో ఉన్నట్లు గుర్తించారు. చిల్లకూరు ఎంపీడీవో అందుబాటులోకి రాలేదు. పుత్తూరు అధికారి తిరుపతిలో ఉన్నట్లు, సూళ్లూరుపేట స్పెషలాఫీసర్ సైతం అందుబాటులో లేరని కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు విషయం ఒకరి నుంచీ ఒకరికి సమాచారం వెళ్ళడంతో అందుబాటులో లేని అధికారులూ ఉరుకుల పరుగుల మీద కార్యాలయాలకు చేరుకున్నట్టు సమాచారం.

సచివాయాల్లోనూ అదే తీరు

ఇక సచివాలయాల్లో పరిస్థితి ఎలా ఉందోనని జిల్లా అధికారులు తెలుసుకునే ప్రయత్నం చేశారు. తడ తహసిల్దారు రాత్రి 10.24 గంటలకు పూడి సచివాలయానికి వెళ్లగా తాళాలు వేసుంది. తర్వాత కారూరు సచివాలయానికి వెళ్ళగా అక్కడ డ్యూటీ చేయాల్సిన సిబ్బంది లేకపోగా తుఫాను డ్యూటీతో సంబంధం లేని ఓ ఉద్యోగి మద్యం మత్తులో నిద్రిస్తున్నట్టు గుర్తించారు. ఆపై పెరియవట్టు సచివాలయానికి వెళ్లగా, అక్కడా తాళాలు వేసి ఉంది. చివరగా అండగుండాల సచివాలయం చేరుకోగా అక్కడే తాళాలే కనిపించాయి.

కలెక్టర్ ఆగ్రహం

సోమవారం రాత్రి మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు తుఫాను విధులకు డుమ్మా కొట్టడం పట్ల కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు రాత్రింబవళ్లు సమస్యాత్మక ప్రాంతాలు తిరుగుతుంటే క్షేత్రస్థాయిలో ఇంత నిర్లక్ష్యంగా ఎలా ఉంటారంటూ వారిని తీవ్రంగా మందలించినట్టు సమాచారం. విధులకు డుమ్మా కొట్టిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిసింది.

విధుల్లో అప్రమత్తంగా ఉండండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో బుధవారం జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన సమీక్షించారు. ముఖ్యంగా చిట్టమూరు, ఓజిలి, కోట, వాకాడు, దొరవారిసత్రం, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, ఏర్లు, కాజ్‌వేల వద్ద నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జిల్లా స్పెషలాఫీసర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ కంట్రోల్‌రూమ్‌కు వచ్చే అత్యవసర సమాచారాన్ని అధికారులకూ తెలియజేయాలన్నారు. డీఆర్వో నరసింహులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



గూడూరు రైల్వేస్టేషన్‌లో సేద తీరుతున్న ప్రయాణికులు

విశాఖ- తిరుపతి మార్గంలో పలు రైళ్లు రద్దు

గూడూరు/తిరుపతి(సెంట్రల్), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తిరుపతి నుంచి వైజాగ్ వెళ్ళు పలు రైళ్ళు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. పూరీ ఎక్స్‌ప్రెస్ 30వ తేది వరకు రద్దు చేశామన్నారు. మంగళవారం బయలుదేరాల్సిన తిరుమల ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-కాకినాడల మధ్య నడుస్తున్న శేషాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు చేశామని పేర్కొన్నారు. తిరుపతి-విశాఖ మధ్య నిడిచే డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసులను రద్దు చేశారు. దీంతో గూడూరు రైల్వే జంక్షన్ నుంచి ప్రయాణించేవారు ఇబ్బంది పడ్డారు. ఆయా రైల్వే స్టేషన్లలో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశారు.

వర్ష ప్రభావ ప్రాంతాల్లో ఎమ్మెల్యేల పర్యటన



తిరుపతి గొల్లవానిగుంటలో అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



రామచంద్రాపురం మండలం రామాపురం పంచాయతీ ఎస్టీ కాలనీలో ఇల్లు కోల్పోయిన వారితో మాట్లాడుతున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని



విడవని వర్షం నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం ముళ్లపూడి ఎస్టీకాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బొజ్జలసుధీర్‌రెడ్డి



సూళ్లూరుపేట మండలంలోని దొండకాలువ వంతెనపై ప్రవాహ ఉద్ధృతిని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ



ముసురువానతో ఇబ్బంది పడుతున్న వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం ఎస్టీ కాలనీవాసులకు ఆహారాన్ని అందజేస్తున్న గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

భారీ వాహనాల రాకపోకలపై ఆంక్షలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావిత ప్రాంతాల్లో భారీ వాహనాల రాక పోకలపై ఆంక్షలు విధించినట్లు ఎస్పీ సుబ్బరాయుడు మంగళవారం తెలిపారు. మంగళవారం రాత్రి7గంటల నుంచి భారీ వాహనాలను జాతీయ రహదారుల వెంట ఉన్న హోల్డింగ్ ప్రాంతాల్లో ఆపుతున్నట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత కోసమే ఈ ఆంక్షలని స్పష్టంచేశారు. తక్షణ సాయం కోసం డయల్ 112 లేదా వాట్సాప్ నెంబరు 8099999977 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

భయం గుప్పెట్లోనే తీరప్రాంతాలు

● బిక్కుబిక్కుమంటున్న స్వర్ణముఖినది పరివాహక ప్రాంతాలు

కోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని సముద్రతీరప్రాంత..మత్స్యకార గ్రామాలు భయం గుపెట్లోనే ఉన్నాయి. మంగళవారం గోవిందపల్లిపాళెం, శ్రీనివాససత్రం గ్రామాల్లో సముద్రం అలజడులతో ఆందోళన చెందారు. గోవిందపల్లిపాళెం వద్ద సముద్రం కసురుపై ఉంటూ పెద్ద ఎత్తున అలలు వచ్చాయి. నాలుగో రోజూ చేపలు పట్టేందుకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లలేదు. 12 గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. సంచార జీవులను కోటలోని బాలికల ఉన్నత పాఠశాలలో చేర్చి వారికి సహాయక చర్యలు చేస్తున్నారు.

తెలుగుగంగ కాలువలో కొట్టుకుపోయిన షరీప్ మృతదేహం లభ్యం

వరదయ్యపాళెం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పసివాడి ప్రాణాలు కాపాడాలన్న తపనతో కాలువలో దూకి కొట్టుకుపోయిన డ్రైవర్ మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఈనెల 26న ఆదివారం సాయంత్రం ఉబ్బలమడుగు జలాశయం సమీపంలోని తెలుగుగంగ కాలువలో ఇరిగేషన్ ఏఈ బాబు తన కారు కడగడానికి మనవడు మహిత్, డ్రైవర్ షరీఫ్‌తో వెళ్లారు. కారు కడుగుతుండగా మహిత్ కాలువతో పడిపోవడంతో రక్షించడానికి దూకిన షరీఫ్ కొట్టుకుపోయిన విషయం విదితమే. ఈక్రమంలో ఈనెల 27న సోమవారం మహిత్ మృతదేహం లభ్యం కాగా మంగళవారం చెట్టుకు ఇరుక్కున్న షరీఫ్ మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది వెలికి తీశారు. కాగా షరీఫ్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్దను కోల్పోవడంతో కుటుంబీకులు భోరున విలపించారు.

పరకామణి చోరీ ఘటనపై హైకోర్టులో మరో పిల్

● రవికుమార్ వ్యవహారంపై సీబీఐ లేదా రిటైర్డు జడ్జితో విచారణ జరపాలన్న శాప్ ఛైర్మన్

తిరుపతి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ పరకామణిలో రవికుమార్ చోరీకి పాల్పడిన వ్యవహారం అంతకంతకూ వేడెక్కుతోంది. ఇప్పటికే దీనిపై దాఖలైన ఓ ప్రజాప్రయోజనాల వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరుపుతుండగా తాజాగా మరో పిల్ దాఖలైంది. ఈ వ్యవహారంలో లోతైన దర్యాప్తు జరపాలని కోరుతూ ఈసారి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు హైకోర్టును ఆశ్రయించారు. కోట్లాది మంది భక్తుల కానుకలకు, మనోభావాలకు సంబంధించిన ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించి సిట్ ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఏపీ పోలీసు, టీటీడీ విజిలెన్స్ అధికారులను సభ్యులుగా నియమించాలని కోరారు. లేకుంటే సీబీఐకి లేదా రిటైర్డు హైకోర్టు జడ్జితో విచారణ కమిషన్ అయినా ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. పరకామణిలో చోరీ ఘటనపై తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో 24-2023 క్రైమ్ నంబరుతో నమోదైన కేసును తిరుపతి కోర్టులో లోక్ అదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవడం వెనుక పెద్ద కుట్ర దాగివుందని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ వ్యవహారంలో వాస్తవంగా ఏమి జరిగిందో తేల్చేందుకు లోతుగా సమగ్ర దర్యాప్తు జరపాల్సిన అవసరముందని, ఆ దిశగా ఆదేశాలివ్వాలని హైకోర్టును కోరారు. రవి నాయుడు దాఖలు చేసిన ప్రజాప్రయోజనాల వ్యాజ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని, సీబీఐని, ఏపీ ప్రభుత్వాన్ని, దేవదాయ శాఖను, హోమ్ శాఖను, డీజీపీని, టీటీడీ ఈవో, టీటీడీ సీవీఎస్‌వోలను ప్రతివాదులుగా పేర్కొన్నారు. రవినాయుడు మంగళవారం దాఖలు చేసిన పిల్‌పై ఆయన తరపున సీనియర్ న్యాయవాదులు మెస్సర్స్ ఉమేష్ చంద్ర, వడ్డి సోమశేఖర్, కర్రా మాధవి, కె.హరికృష్ణ తదితరులు హైకోర్టులో వాదనలు వినిపించనున్నారు.

భార్య ఆచూకీ కోసం వెతుకులాట

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన భార్య కోసం 20రోజులుగా వెతుకుతున్నాడో భర్త. బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా... మహబూబ్ నగర్ జిల్లా కొత్తూరు మండలం మేకగూడకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి విజయలక్ష్మి, దంపతులు ఈ నెల 6న తిరుమల వచ్చారు. దర్శనానంతరం వీరు ట్యాక్సీలో తిరుపతి చేరుకున్నారు. నగరంలోని గరుడ వంతెన మూడో పిల్లర్ వద్ద ట్యాక్సీ దిగారు. ట్రాఫిక్ రద్దీలో రోడ్డు దాటుతుండగా విజయలక్ష్మి కనిపించలేదు. దీంతో ఆందోళన చెందిన చంద్రశేఖరరెడ్డి దాదాపు వారం రోజుల పాటు వెతికారు. ఫలితం లేకపోవడంతో ఈ నెల 16న ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. మతి స్థిమితం లేని తన భార్య ఆచూకి కోసం అప్పటి నుంచి ఆమె భర్త కాళ్లరిగేలా తిరుగుతూనే ఉన్నాడు. పోలీసులను ప్రాధేయపడుతూనే ఉన్నాడు. ఇంతవరకూ వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని చంద్రశేఖరరెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పోలీసులు చొరవ తీసుకుని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరుతున్నాడు.

గొడుగుల కింద వ్యాపారం



మంగళవారం జడివాన కురుస్తుండటంతో తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో వ్యాపారులు ఇలా గొడుగుల కింద వ్యాపారం చేశారు. కొనుగోలుదారులు గొడుగులు వేసుకుని రాగా.. మరికొందరు తడిచిపోయారు.

లోపలకు వెళ్లొద్దు



కొద్ది రోజులుగా తిరుపతి గాంధీరోడ్డులోని హథీరాంజీ మఠం భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షంతో ఎవరినీ లోపలకు వెళ్లనీయకుండా ఇలా బారికేడ్లు పెట్టారు.

వెంటాడిన మృత్యువు

● రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి



రవికుమార్ మృతదేహం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో జరిగిన ప్రమాదంలో కావలికి చెందిన రవికుమార్(56) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... కావలికి చెందిన రవికుమార్ కారును డ్రైవ్ చేసుకుంటూ మంగళవారం తెల్లవారుజామున చెన్నైకు బయలుదేరాడు. గూడూరు సమీపంలోని పారిచర్లవారిపాళెం వద్ద వేచివున్న ప్రయాణికుడు జావిద్‌ను కారులో ఎక్కించుకున్నాడు. నాయుడుపేట మండలం బిరదవాడ సమీపంలో ఆగిఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు ఢీకొంది. చిన్నపాటి గాయాలతో బయటపడ్డ రవికుమార్, జావిద్ బయటకు వచ్చి కారును పరిశీలిస్తుండగా ఆ మార్గంలో వెళ్తున్న మరో లారీ రవికుమార్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐసీఎస్ ఎంపిక పోటీలు వాయిదా

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో ఆలిండియా సివిల్ సర్వీస్(ఏఐసీఎస్) క్రీడా పోటీలను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు డీఎస్‌డీవో శశిధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈమేకు సంబంధిత సివిల్ సర్వీస్ అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు!



విచారణాధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద రెడ్డి

రేణిగుంట అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం తనిఖీలు జరిగాయి. ఈ కార్యాలయంపై వస్తున్న ఆరోపణలపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ విచారణకు ఆదేశించిన విషయం విదితమే. నెల్లూరు డీఐజీ మునిశంకరయ్య నేతృత్వంలో అధికారుల బృందం మధ్యాహ్నం 11.30 నుంచి 1.30 గంటలదాకా కంప్యూటర్లలోని సమాచారాన్ని పరిశీలించారు. ఈసమయంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనందరెడ్డి వారి వెంటే ఉన్నారు. కొందరు ప్రయివేటు వ్యక్తులు కూడా కార్యాలయంలో ఉన్నారు.